# కర్నూలు । నంద్యాల వార్త

20 అక్టోబర్ , 2023 | శుక్రవారం | పేజీలు 4


## పాఠశాల పనులను పరిశీలించిన ఆర్థిక మంత్రి బుగ్గన

**- డిసెంబర్‌లోగా పనులు పూర్తి చేయాలని ఆదేశాలు**



**బేతంచెర్ల, అక్టోబర్19, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గోరుమానుకొండ సమీపంలో జరుగుతున్న మహాత్మా జ్యోతిరావుపూలే బాలుర గురుకుల పాఠశాల, ఎంఎస్ఎంఈ, టీఐ కళాశాలల నిర్మాణ పనులను రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం పరిశీలించారు. మహాత్మా జ్యోతిరావుపూలే బాలుర గురుకుల పాఠశాల రూ.36కోట్లతో, 110 గదులతో చేపడుతున్న నిర్మాణ పనులు దాదాపు తుదిదశకు వచ్చాయని అధికారులు మంత్రికి వెల్లడించారు. అత్యంత వేగంగా నాణ్యతతో కూడిన పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. అలాగే వివిధ వృత్తులల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు ఎంఎస్ఎంఈ శిక్షణా కేంద్రాన్ని రూ.4కోట్లతో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించి పనుల పురోగతిని అధికారులను, గుత్తేదారులను మంత్రి అడిగి తెలుసుకోవడం జరిగింది. అలాగే రూ.7.8 కోట్లతో చేపట్టిన ఐటీఐ నిర్మాణ పనులను పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించడం జరిగింది. అలాగే ఐటీఐ కోసం అత్యాధునికమైన యంత్రాలు, సామాగ్రి, ఇతర పరికరాల కొనుగోలు కోసం అదనంగా రూ.3కోట్ల నిధులు మంజూరైనట్లు మంత్రి తెలిపారు. పనులను ఖచ్చితంగా డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని అధికారులు, గుత్తేదారులకు ఆదేశించడం జరిగింది. ఆయనతోపాటు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

## కెసికెనాల్‌కు నీళ్లు రాక.. రైతుల అవస్థలు..!

**- మాజీ మంత్రి అఖీల ప్రియ కెసి కాల్వ వెంబడి పరిశీలన**

**నంద్యాల, అక్టోబరు 19, ప్రభాతవార్త:** రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నీతులు చెబుతున్న ఈప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి భూమా అఖీల ప్రియ అవేదన వ్యక్తం చేశారు. గురువారం రైతులతో కలిసి ఆమె దొర్నిపాడు నుంచి గోస్పాడు మండలం యాళ్లూరు వరకు కెసికెనాల్ వెంబడి ప్రయాణించారు. కెసికెనాల్‌కు నీరురాకపోతే వేసిన పంటలు ఎండిపోతున్నాయని ఆత్మహత్యలే శరణ్యమని పేర్కొన్నారు. అఖీల ప్రియ కెసికెనాల్ అధికారులతో మాట్లాడారు. వేసిన పంటలు కాపాడుకునేందుకు నీరు వదలాలని అధికారులతో చర్చించిన అనంతరం దశలవారిగా నీరు వదులుతామని హామి ఇచ్చినట్లు ఆమె తెలిపారు. నీరు వస్తే పంట చేతికి వసు_ందన్న ఆనందాన్ని రైతులు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కెసికెనాల్ ప్రాంత రైతులు పాల్గొన్నారు.



## రాష్ట్ర అభివృద్ధే.. వైసీపీ లక్ష్యం..!

- చేదోడు పథకం కింద రూ.325,02 కోట్లు జమ
- ఆరోగ్య సురక్షతో ఉచిత వైద్య సేవలు..!
- దేశమంతా మన రాష్ట్ర పాదుపు సంఘాలను చూస్తోంది..!
- తోడేళ్ల మాయ మాటలు నమ్మకండి.
- గత పాలన..తమ పాలనకు చాలా తేడా ఉంది..!






ఇచ్చిన మాటను నిలబెట్టుకునే ప్రభుత్వం తమదని, ఇచ్చిన మాటను పక్కన పెట్టే ప్రభుత్వం చంద్రబాబుదని ఆయన వాఖ్యానించారు. చంద్రబాబు పాలనకు..ప్రస్తుత పాలనకు తేడా చూడాలని..మీ బిడ్డను ఆశీర్వదించాలని ఆయన పిలుపునిచ్చారు. జగనన్న చేదోడు పథకం కింద వరుసుగా నాలుగో ఏడాది లబ్ధి దారులకు రూ.10 వేల చొప్పున వారికి అకౌంట్లలోకి బటన్ నొక్కి నగదు విడుదల చేశారు. అనంతరం నిర్వహించిన సభలో సిఎం జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ తమ హయంలో ఏ పథకం తీసుకున్నా ఈ కార్యక్రమం చేసినా..ఎక్కడా అవినీతి, వివక్ష లేకుండా చూస్తున్నామన్నారు. కులాలు, ప్రాంతాలు, మతాలు, రాజకీయాలు, పార్టీలకు అతీతంగా తాము పాలన సాగిస్తున్నట్టు చెప్పారు. గతంలో రాష్ట్రంలో గజదొంగల ముఠా ఒకటి ఉండేదని, అది రాష్ట్రాన్ని దోచేసిందని జగన్ మోహన్ రెడ్డి అన్నారు. అప్పుడు అభివృద్ధి ఎందుకు జరగలేదో ప్రజలు ఆలోచించాలన్నారు.

అప్పుడు.. ఇప్పుడు అదే రాష్ట్రం, అదే బడ్జెట్, మారింది కేవలం ముఖ్యమంత్రి మాత్రమే. చంద్రబాబు పాలన చూస్తే కుప్పంలో కూడా ఆయన మావాడే అని చెప్పుకునే పరిస్థితి లేదు. కుప్పంలో ఒక్క పేదవాడికి కూడా చంద్రబాబు స్థలం ఇవ్వలేదు. కానీ మీ బిడ్డ ప్రభుత్వం కుప్పంలో కొన్ని వేల ఇళ్ల స్థలాలు కేటాయింపుతో పాటు ఇళ్ల నిర్మాణాలు కూడా చేపట్టింది అని జగన్ మోహన్ రెడ్డి అన్నారు. చంద్రబాబు పాలనలో సున్నా వడ్డీ పథకాన్ని కూడా ఎత్తేశారన్న జగన్ మోహన్ రెడ్డి.. ఎన్నికల సమయంలో చంద్రబాబు మేనిఫెస్టోను తీసుకొచ్చి ఎన్నికల తర్వాత చెత్తబుట్టలో పడేశారని విమర్శించారు. కానీ, తమ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన 99శాతం హామీలను అమలు చేశామని వివరించారు. చంద్రబాబు రుణమాఫీ కూడా చేయలేదన్నారు. మీ బిడ్డ నమ్ముకుంది కేవలం పైన దేవుడిని, మిమ్మల్ని మాత్రమే అన్నారు. పేదవాడు ఒకవైపు..పెత్తందారు ఒకవైపు..రేపు జరగబోయే ఎన్నికల యుద్ధంలో తోడేళ్లందరూ ఏకమవుతారు. వీళ్లు చెప్పిన అబద్దాలు నమ్మకండి, మీ బిడ్డ పాలనలో మీ ఇంట్లో మంచి జరిగిందా లేదా ఆలోచించండి తిరిగి వైసిపి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చే భాద్యత కూడ మీ పైనే ఉందని జగన్ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వైసిపి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీ, కర్నూలు జిల్లా కలెక్టర్ సృజన, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్‌లు పాల్గొన్నారు.

**ఎమ్మిగనూరు క్రైం ప్రభాతవార్త:**

## పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి - సీపీఐ రామకృష్ణ

**పత్తికొండ, అక్టోబర్19, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సక్రమంగా కురవక వేసిన పంటలు రైతులకు పంటలు చేతిరాక నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.రామ చంద్రయ్యలు డిమాండ్ చేశారు. గురువారం పత్తికొండ మండలం చిన్నహుల్తి గ్రామ పరిధిలో కౌలు రైతు హనుమంతు ఐదెకరాలు కౌలుకు తీసుకుని వేసిన వేరుశనగ పంటను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో హనుమంతు వేరుశనగ పంటను సాగుచేశారని అయితే వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో పంట నష్టపోయారని ఎకరాకు రూ.30వేలు పెట్టుబడి పెట్టారని దీంతో ఆర్థికంగా నష్టపోయారని వారు తెలియజేశారు. ఎరువులు, క్రిమిసంహారక మందుల కోసం చేసిన ఖర్చు కూడా నష్టపోయారని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఆయా బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను ప్రభుత్వం మాఫీ చేయాలన్నారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా 106 చెరువులను నీటిని నింపాలని సరిగా వర్షాలు లేకపోవడంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టుల్లో తగినంత నీరు లేదన్నారు. 70 సంవత్సరాల కాలంలో శ్రీశైలంలో నీటి మట్టం తక్కువగా



ఉండడం ఇది రెండవసారి అని వారు తెలిపారు. ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా రైతులకు, కూలీలకు పనులు కల్పించి వ్యవసాయానికి అనుసంధానం చేయాలని ఉపాధి కూలీలకు 200 రోజులు పనులు కల్పించాలన్నారు. రైతు సమస్యల పరిష్కారం కొరకు ఈ నెల 27,28 తేదిల్లో అని న్ని పార్టీలతో, ప్రజా సంఘాలతో, రైతు సంఘాలతో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాలు చేసి పరిష్కారానికి కృషి చేస్తామని వారు తెలియజేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, గురుదాస్, నబీరసూల్, రాజా సాహెబ్, కారన్న, ఈరన్న, వెంకట్రామిరెడ్డి, రంగన్న, రామాంజనేయులు, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## శేషవాహనంపై కొలువుదీరిన శ్రీస్వామిఅమ్మవార్లు..!

**: స్కందమాత అలంకారంలో అమ్మవారు**

**శ్రీశైలంప్రాజెక్టు, అక్టోబర్19, ప్రభాతవార్త**

శ్రీశైలక్షేత్రంలో వైభవంగా జరుగుతున్న దసర మహోత్సవాల ఐదవరోజైన గురువారంనాడు ఉదయం అమ్మవారికి ప్రాతకాల పూజలు, విశేష కుంకుమార్చనలు, నవావరణార్చనలు, జపానుష్టానాలు, పారాయణలు, సూర్య నమస్కారములు, చండీ హోమం, పంచాక్షరి, భ్రామరి, బాలా జపానుష్టానములు, చండీపారాయణ, చతుర్వేద పారాయణలు, కుమారి పూజలు జరిపించబడ్డాయి. అదే విధంగా రుద్రహోమం, రుద్రయాగాంగ జపములు, రుద్రపారాయణలు జరిపించబడ్డాయి. అదే విధంగా ఈ సాయంకాలం జపములు, పారాయణలు, నవావరణార్చన, కుంకుమార్చన, చండీహోమం జరిపించబడ్డాయి. ఈక్రమంలోనే రాత్రి 9.00 గంటల నుండి కాళరాత్రిపూజ, అమ్మవారి ఆస్థానసేవ, సువాసినీపూజలు జరిగాయి.

**కుమారి పూజ:** దసరా మహోత్సవాలలో బాగంగా ప్రతిరోజు కుమారి పూజలు నిర్వహించడం జరుగుతుంది. ఈ కుమారి పూజలో రెండు సంవత్సరాల నుంచి పదిసంవత్సరాల వయస్సు ఉన్న బాలికలను పూలు, పండ్లు, నూతన వస్త్రాలను సమర్పించి పూజించడం జరిగింది. కుమారిపూజ నవరాత్రి ఉత్సవాలలో ఒక ముఖ్యమైన సంప్రదాయం.

**స్కందమాత అలంకారంలో అమ్మవారు:** ఈ నవరాత్రి మహోత్సవాలలో చేయబడుతున్న నవదుర్గ అలంకారంలో భాగంగా సాయంత్రం శ్రీఅమ్మవారి ఉత్సవమూర్తిని స్కందమాత స్వరూపంలో అలంకరింపజేయడం జరిగింది. నవదుర్గలలో ఐదవ రూపమైన ఈ దేవి చతుర్భుజాలన కలిగి ఉండి, ఒకచేతిలో స్కందుణీ పట్టుకుని ఉండి, మిగిలిన చేతులలో పద్మాలను, అభయముద్రలను ధరించి ఉంటుంది. ఈమె ఒడిలో బాలుని రూపంలో స్కందుడు (కుమారస్వామి) కూర్చొని ఉంటాడు. స్కందదేవుని జనని కావడం వలన ఈ దుర్గాస్వరూపం స్కందమాతగా ప్రసిద్ధి చెందింది. ఈ స్కందమాతను ఉపాసించడం వల్ల స్కందదేవుని కూడా ఉపాసన చేసిన ఫలితం లభిస్తుందని చెఎబుతాడు. ఈదేవిని ఆరాదించడం వలన సకల కోర్కెలు నెరవేరడమే కాకుండా శాంతి సౌఖ్యాలు లబిస్తాయి.

**శేషవాహనంపై కొలువుదీరిన శ్రీస్వామిఅమ్మవార్లు:** ఈ ఉత్సవాలల్లో భాగంగా శ్రీస్వామిఅమ్మవార్లకు నిర్వహిస్తున్న వాహనసేవలలో భాగంగా గురువారంనాడు శేషవాహనంసేవ జరిపించ బడింది. ఈ వాహనసేవలలో శ్రీస్వామిఅమ్మవారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరింపజేసి శేషవాహనంపై వేంచేబు చేయించి పూజాదికాలు చేయబడ్డాయి. శేషవాహనాధీశులైన స్వామివారిని, అలంకీకృత స్కందమాత అమ్మవారి ఉత్సవరులను ఆలయం వెలుపలకు తరలించి మేళతాళాలు, మంగళవాయిధ్యాలు, భజంత్రిలు, వివిధ జానపద కళారూపాలు ప్రదర్శన నడుమ క్షేత్ర ప్రధానవీదుల్లో ఊరేగించారు. ఆలయ గంగాధర మండపం నుంచి ప్రారంభమైన గ్రామోత్సవంలో దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు దంపతులు, ట్రస్టుబోర్డు సభ్యులు, అర్చకస్వాములు, అదికారులు, భక్తులు శ్రీస్వామి అమ్మవార్లను తిలకించి పునితులైయ్యారు.






## ప్రారంభమైన దేవరగట్టు మాలమల్లేశ్వర స్వామి బన్నిఉత్సవాలు..!

**- భక్తిశ్రద్ధలతో కంకణాధారణ కార్యక్రమం**

**ఆలూరు, అక్టోబరు 19, ప్రభాతవార్త**

రాష్ట్రంలో ఎంతో ప్రసిద్ధిగాంచిన దేవరగట్టు శ్రీ మాలమల్లేశ్వర స్వామి బన్నిఉత్సవాలు ఈ నెల 19వ తేదీ నుండి అక్టోబరు 28వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరుగుతున్నట్లు దేవరగట్టు ఆలయ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, నెరణికి, నెరణికి తాండ, కొత్తపేట గ్రామాల కమిటీ నిర్వాహకులు వీరనాగప్ప, సోము, నాయక్‌లు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నియోజకవర్గంలోని నెరణికి గ్రామంలో ఉన్న శ్రీ మాలమల్లేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను నెరణికి గ్రామం నుండి దేవరగట్టుకు భక్తులు చేర్చారు. దేవరగట్టులోని ఆలయానికి చేరిన ఉత్సవ మూర్తులకు నెరణికి పురోహితుడు రవిశాస్త్రి, ప్రధాన అర్చకుడు గిరిస్వామి, మహేష్‌స్వామి, మల్లయ్యస్వామి తదితరులు గణపతి పూజ, ఆకుపూజ తదితర పూజలు నిర్వహించి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. రాత్రి దేవరగట్టు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తాదుల మద్య కంకణాధారణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కంకణాధారణ కార్యక్రమం సందర్బంగా భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కంకణాధారణ సందర్బంగా ఆలూరు సిఐ వెంకటేశ్వర్లు ఆద్వర్యంలో హొళగుంద ఎస్ఐ శ్రీనివాసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



## పురపాలక అనుమతుల్లో... అంతులేని అవినీతి...!

- ఓ చిరుద్యోగి ద్వారా అనుమతులో లావదేవీలు
- ఆత్మకూరు పురపాలకలో రాత్రివేళలో మామూల్ల సమస్యల పరిష్కారం..!

**మున్సిపాలిటిలో చిన్న కట్టడాల నుంచి భారీ భవన కట్టడాల వరకు అనుమతులు లేకుండా అంతులేని అవినీతి రాజ్యం ఏలుతుంది. 2012 వరకు మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న ఆత్మకూరు మున్సిపాలిటిలో ఏడాది క్రితం గ్రేడ్ 2 మున్సిపాలిటిగా మారింది. ఈ మున్సిపాలిటిలో పెద్దసంఖ్యలో సిబ్బంది కొరత ఉండడంతో సచివాలయ సిబ్బందితో ప్రధాన కార్యాలయంల చక్రం తిప్పుతున్న అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై తెలుగుజాతీయ వార్త దిన పత్రిక పాఠకులకు ప్రత్యేక కథనంను అందించనుంది.. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శాఖలో బదిలీలు జరిగిన నేపథ్యంలో ఈ మున్సిపాలిటిలో ఇంత వరకు ఖాళీ స్థానంలో ఉద్యోగులను నియమించ లేదు. కేవలం ఇంచార్జీల అధికారులు, సచివాలయ ఉద్యోగులతో పరిపాలన కొనసాగిస్తున్నారు. మున్సిపాలిటిలో పెద్ద సంఖ్యలో సిబ్బంది కొరత ఉండడంతో ఇదే అదునుగా బావించిన ఓ ఉన్నతాధికారి సచివాలయంలో చిరుద్యోగిగా విధులు నిర్వహిస్తున్న నమ్మిన బంటుగా ఏర్పాటు చేసుకొని ప్రతి పనికి ఇంతా అని ధర నిర్ణయించుకున్నారు. లక్షలో లావదేవీలు జరుగుతున్నట్లు అనేక ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా అనుమతులు లేని భవన నిర్మాణాలు వారసత్వాల ద్వారా మార్పులు చేర్పులు జరిపించడంలో ఈ చిరుద్యోగి ద్వారనే కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ముడుపులు ఉన్నతాధికారి చెల్లిస్తే పనులు సులభంగా జరుగుతున్నట్లు సమాచారం.**




**ఆత్మకూరు అక్టోబర్19, ప్రభాతవార్త:** కాసులు చెల్లించలేని వారికి నిబంధనల పేరుతో ముప్పుతిప్పలు పెడుతున్న పట్టణ ప్రణాళిక అధికారి... మున్సిపాలిటిలో పట్టణ ప్రణాళిక అభివృద్ధి అధికారి పాత్ర ఎంతో కీలకంగా ఉంటుంది. ఈ పోస్టు ఖాళీగా ఉండడంతో ఈ అధికారి స్థానంలో చిరుదోౄగి అయిన సచివాలయ ప్లానింగ్ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ కమీషన్‌లతో కక్కుర్తి పడుతూ ఆడిందే ఆట పాడిందే పాట అనే చందంగా మారిందని చెప్పవచ్చు. పగలంతా కార్యాలయంలో పనులు చేస్తూ సాయంత్రం 5గంటల నుంచి 7గంటల సమయంలో ఈ చిరుదోౄగి కలసి నూతన భవనాల నిర్మాణానికి అనుమతులు కావాలంటే ఖచ్చితంగా ఈ చిరుద్యోగికి ముడుపులు చెల్లించాల్సిందేనని ప్రజలు వాపోతున్నారు. ఎంతటి కట్టుదిటమైన పని అయిన క్షణాలలో జరుగుతుందని చెబుతున్నారు. లేదంటే అనేక కొరవిల ద్వారా కార్యాలయం చుట్టు తిరగాల్సిందే. భవనాలు, దుఖాణాలు, హోటల్స్, షెడ్డు నిర్మాణాలు ఇతర భవన నిర్మాణాలపై ఈ చిరుదోౄగి ద్వారా రాత్రివేళ సమయంలో ముడుపులు చెల్లిస్తే చాలు



అనుమతులు రాకుండానే తప్పుడు పద్ధతిలో నిర్మాణాలు చేపట్టు కోవచ్చు. అలాగే పట్టణ చివారులలో ల్యాండ్ కన్వరేషన్ లేకుండానే అక్రమ లేవుట్లు వేసుకొని విచ్చలవిడిగా రియల్ ఎస్టేట్ యాజమానులు ప్లాట్లు వి క్రయాలు జోరుగా కొనసాగుతు న్నాయి. మున్సిపాలిటిలో మాములు అందిస్తే చాలు ఎలాంటి వాటికైన క్రమవి క్రయాలు జరుపుకోవచ్చనే అభిప్రాయం ప్రజలో నెలకొందని చెప్పవచ్చు. పురపాలక సంఘం పాలక మండలిలో ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లు లేకపోవడంతో నేతలు, అధికారులు చెప్పిన్నట్లు వేదశాసనంగా మారింది. ఎలాంటి కట్టడాలకు అయిన క్షణాలలో అనుమతులు వచ్చేస్తాయి ఆన్‌లైన్ ద్వారా ధరఖాస్తు చేసుకున్నామని ...


• వివరాలు 2లో


## జగనన్న చేదోడు పథకం కింద లబ్దిదారుల ఖాతాల్లో రూ.14.30 కోట్ల జమ..

**: జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సమూన్**

**నంద్యాల, అక్టోబరు 19, ప్రభాతవార్త ప్రతినిధి:** జగనన్న చేదోడు పథకం కింద జిల్లాలో 14,304 మంది అర్హులైన లబ్ధిదారుల ఖాతాలో ౢ రూ.14,30,40,000 రాష్ట్ర ముఖ్యమంత్రి బటన్‌నొక్కి జమచేశారని జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సమూన్ పేరొ ్కన్నారు. గురువారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గం నుంచి రాష్ట్రముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న చేదోడు పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 3వ ఏడాది 3,25,020 మంది అర్హులైన రజక, నాయిబ్రహ్మణ దర్జీలకు 325.2 కోట్ల ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారుల ఖాతాలోకి నేరుగా జమచేసే కార్యక్రమాన్ని లైవ్ ద్వారా స్థానిక విడియోకాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టరు బెస్త సంక్షేమ సంఘం డైరెక్టరు చంద్రశేఖర్, రజక సంఘ డైరెక్టరు వెంకటలక్ష్మీ తదితరులు వీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో జగనన్న చేదోడు పథకం కింద జిల్లాలో 4వ విడతలో ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున 14,304 మందికి అర్హులైన లబ్దిదారుల ఖాతాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి జమచేశారన్నారు. జిల్లాలోని ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 2,820 మంది లబ్ధిదారులు రూ,2,82,00,000లు, బనగానపల్లెలో 3,163 మందికి రూ.3,16,30,000లు, డోన్‌లో 1,687 మందికి రూ.1,68,70,000 లు, నందికోట్కూరులో 1,417 మందికి రూ.1,41,70,000లు నంద్యాలలో 2,999 మందికి రూ.2,99,90,000లు శ్రీశైలంలో 1519మందికి రూ.1,51,90,000లు పాణ్యంలో 699 మందికి రూ.69,90,000లు వెరసి మొత్తం 14,304 మందికి లబ్దిదారుల ఖాతాల్లో రూ.14,30,40,000 జమచేసినట్ల కలెక్టరు పేర్కొన్నారు. మొదటి విడతలో 12,349 మందికి లబ్దిదారులకు రూ.12.349 కోట్లు, రెండవ విడతలో 11,479 మంది లబ్దిదారులకు రూ.11.479 కోట్లు, మూడవ విడతలో 13536 మంది లబ్దిదారులకు రూ.13.536 కోట్లు గతంలో పంపిణి చేయడం జరిగిందన్నారు. అనంతరం కలెక్టరు విడియోకాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో జగనన్న చేదోడు పథకం కింద 14,304 మంది అర్హులైన లబ్దిదారుల ఖాతాల్లో రూ.14,30,40,000 చెక్కును జిల్లా కలెక్టరు బెస్త సంక్షేమ డైరెక్టరు, రజక సంఘ డైరెక్టరు లబ్దిదారులకు అందజేశారు.



## ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి ఎమ్మెల్యే



**నందికొట్కూరు,అక్టోబర్ 19,ప్రభాతవార్త:** జగనన్న చేదోడు కార్యక్రమం ప్రారంభించేందుకు ఎమ్మిగనూరుకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డికి నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై సి.యం.కు వివరించారు.

## జగనన్నకు న్యాయం కావాలంటూ బిక్షాటన



**కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 19,ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా కర్నూలులో టిడిపి నేతలు వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ టీజి భరత్ అధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయం ఎదుట బిక్షాటన చేపట్టారు. రోడ్డుపై నిలబడి చంద్రబాబుకు న్యాయం కావాలంటూ బిక్షం ఎత్తుకున్నారు. అటువైపుగా వెళ్తున్న వాహనదారులతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అన్యాయంగా అరెస్టు అయ్యారని చెప్పారు. ఆయనకు న్యాయం కావాలని కోరుతున్నామని చెప్పారు. రాజకీయంగా ఎదుర్కొలేక కేసులతో ఇబ్బందులు పెడుతున్నారని టిడిపి నేతలు అన్నారు. ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో టిడిపి నేతలు నాగరాజుయాదవ్, అబ్బాస్, ముంతాజ్, సత్రం రామకృష్ణుడు, ఈశ్వర్, రాజశేఖర్‌యాదవ్, మోహన్ శ్రీనివాసులు, రమీజ్ సుందర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## స్కందమాత అలంకారంలో శ్రీ చౌడేశ్వరిమాత



స్కందమాత అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీ చౌడేశ్వరిమాత

**బనగానపల్లె, అక్టోబర్19, ప్రభాతవార్త:** బనగానపల్లె మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిమాత దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 5వ రోజు గురువారం స్కందమాత అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో విఎల్ఎన్ రామానుజన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దేవిశరన్నవరాత్రి ఉత్సవాలకు అమ్మవారికి రోజుకో అలంకరణ చొప్పున నిర్వహిస్తున్నారు. గురువారం 5వ రోజు అమ్మవారికి పంచామృతాభిషేకం, సహస్ర నామ పూజలు విశేషంగా నిర్వహించారు. బనగానపల్లె పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త గాలి మద్దిలేటిరెడ్డి, కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన నాగశయనం, బెంగుళూరుకు చెందిన కె.ఇ.దివాకర్ దంపతులు 5వ రోజు పూజకు ఉభయదాతలుగా వ్యవహరించారు. శరన్నవరాత్రి ఉత్సవాలను పుస్కరించుకుని అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేక మండపంలో 5వ రోజు స్కందమాత అలంకారంలో నిలిపి భక్తులకు దర్శనాలు కల్పించారు. శ్రీ చౌడేశ్వరిమాత మూలవిరాట్‌కు పూలమాలలతో విశేషమైన అలంకరణ నిర్వహించారు. ప్రత్యేక నివేదనలు సమర్పించి అనంతరం భక్తులకు ప్రసాద వితరణ గావించారు. సాయంకాలం ప్రదోషకాల పూజలు, కుంకుమార్చనలు, చిన్నతేరులో అమ్మవారి ప్రాకారోత్సవం భక్తుల సమక్షంలో నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలను 5వ రోజు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి శ్రీ చౌడేశ్వరిమాతను దర్శించుకుని వివిధ ఉత్సవ కార్య క్రమాలను వీక్షించి తరించారు.

# భావితరాల భవిష్యత్ ఆరోగ్యమే వైఎస్సార్ ప్రభుత్వ ధ్యేయం

- వైద్య,వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేస్తున్న వైసీపీ ప్రభుత్వం
- వైఎస్సార్ హెల్త్‌క్లినిక్,రైతుభరోసా కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే
- రైతులకు సబ్సిడీ ట్రాక్టర్లను అందించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి





**బనగానపల్లె, అక్టోబర్19, ప్రభాతవార్త:** బనగానపల్లె మండలంలోని ఇల్లూరుకొత్తపేట గ్రామంలో రూ.40.30లక్షలతో నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రం మరియు వైఎస్సార్‌హెల్త్ క్లినిక్ సెంటర్లను బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గురువారం ప్రారంభించారు. అలాగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రైతు సంఘాల గ్రూప్‌లకు సబ్సిడీ పై ట్రాక్టర్లను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ రైతులకు కల్తీలేని ఎరువులు, నాణ్యమైన విత్తనాలను అందించాలనే లక్ష్యంతోనే ప్రతి 2వేల జనాభాకు గ్రామ సచివాలయంతోపాటు రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఆ గ్రామానికి సంబంధించినటువంటి రైతులకు పంటనష్ట పరిహారం అందించడానికి రైతు భరోసా కేంద్రాల సిబ్బంది చాలా ఉపయోగపడుతున్నారని చెప్పారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్‌హెల్త్ క్లినిక్ సెంటర్లను ఏర్పాటు చేయడమే కాకుండా ప్రతినిత్యం ఆశావర్కర్, ఏఎన్ఎంలు అందుబాటులో ఉండి ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ఆ కుటుంబాలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతోనే వైఎస్సార్ హెల్త్ క్లినిక్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. నిత్యం ప్రజల కోసం కష్టపడే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే మనకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతోపాటు గ్రామాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. అనంతరం వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రైతు సంఘాల గ్రూప్‌లకు సబ్సిడీ పై ట్రాక్టర్లను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం పేదలకు అందిస్తున్నటువంటి వైద్యసహాయం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని భావితరాల ప్రజల ఆరోగ్యం కోసం ఆంధ్రరాష్ట్ర వ్యాప్తంగా పది వేల గ్రామ సచివాలయాల్లో 15వేల కేంద్రాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని చెప్పారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మొత్తం 905 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ శివశంకరుడు తెలిపారు. అవుకు మండల వైసీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా షుగర్, బీపీ, కడుపునొప్పి, దీర్ఘ కాలిక వ్యాధులు, హెర్నియా సంబంధించినటువంటి వ్యాధులతోపాటు ఇతర వ్యాధులకు పరీక్షలకు నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే ఎవరికైనా మెరుగైన చికిత్స కోసం కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా ఆపరేష్లు చేసి ముందులను ఉచితంగా అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతోనే వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ సెంటర్లను ఏర్పాటు చేశారన్నారు. రైతుభరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వైద్య, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వైసీపీ ప్రభుత్వం వేసిందన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలనే లక్ష్యమే జగనన్న లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ఏ.శివరామయ్య, తహసీల్దార్ కిషోర్ కుమార్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, గ్రామ సర్పంచ్ గోరంట్ల రమణ, గ్రామ వైసీపీ నాయకులు రెడ్డిబాలిరెడ్డి, రాఘవరెడ్డి, కర్రెద్దుల వెంకట సుబ్బారెడ్డి, కాపులపల్లె వెంకటేశ్వర్లు, నామాల మహేష్, తోకల నారాయణ, కాపులపల్లె కొండారెడ్డి, మిట్టపల్లె రామకృష్ణారెడ్డి, రఘురాముడు, పంచాయతీ సెక్రటరీ నాయక్, ఎంపీహెచ్‌ఈవో నల్లగట్ల వెంకటేశ్వర్లు, డాక్టర్ సోహేల్, వైద్యసిబ్బంది, వ్యవసాయ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక మంత్రిని కలిసిన వడ్డెర సంఘం నాయకులు



**బేతంచెర్ల, అక్టోబర్19, ప్రభాతవార్త:** రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని వడ్డెర సంఘం మండల అధ్యక్షులు దేరంగుల సుబ్బరాయుడు, గౌరవాధ్యక్షులు మక్కల సుబ్బరాయుడు, ఆర్టీసీ రామపుల్లయ్యలు గురువారం మర్యాదపూర్వకంగా బేతంచెర్లలోని ఆయన స్వగృహం నందు కలిశారు. ఈ సందర్భంగా వడ్డెర కులస్థులు సంచార జీవనం సాగిస్తూ గతంలో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని ప్రస్తుతం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తమ కులం ఎస్టీ జాబితాలో ఉందని ఈ ప్రాంత వాసులను కూడా ఎస్టీ జాబితాలో చేర్చి తమ పిల్లలకు భవిష్యత్తు ఉండేలా చూడాలని అందుకు సహకరించాలని మంత్రిని కోరినట్లు వారు తెలిపారు. వారితోపాటు పెద్దిరాజు, చల్లా శివ, మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో హిట్లర్ పాలన : మాజీ మంత్రి భూమా అఖిలప్రియ



**చాగలమర్రి, అక్టోబర్19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించి హిట్లర్ పాలన కొనసాగుతుందని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ విమర్శించారు. గురువారం మండలంలోని పెద్దవంగలి గ్రామంలో బాబుకు తోడుగా మేం సైతం కార్యక్ర మంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన అఖిలప్రియకు గ్రామ టీడీపీ నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు గజమాలతో ఆమెకు ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ఉన్నా హజరత్ దస్తగిరిస్వామి దర్గా వద్ద భూమా అఖిలప్రియ ప్రత్యేక ఫాతేహాలు నిర్వహించారు. అలాగే గ్రామంలోని ఇంటింటికి వెళ్లి బాబు అక్రమ అరెస్టును ప్రజలకు వివరిస్తూ రాబోయే ఎన్నికల్లో టీడీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. స్థానిక సెంటర్‌లో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు ప్రజా సమస్యలను మరిచి కేవలం వారి కమిషన్ల కోసమే పనిచేస్తున్నారని ఆరోపించారు. రైతులు, రైతు కూలీలు ఈ ప్రజాప్రతినిధులకు ఏమాత్రం పట్టడంలేదని కేసీకెనాల్, తెలుగుగంగ కాలువల కింద పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నా కూడా వారికి నీరు ఇచ్చి ఆదుకునే పరిస్థితిలేదన్నారు. శాంతియుతంగా ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించినా కూడా అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం మాదిరిగా ఒక నియంతాల అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నరన్నారు. రాష్ట్రం విడిపోయిన తరువాత ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన కృష్ణ జలాల వాటాను ఇతర రాష్ట్రాలు ముఖ్యమంత్రులు తరలించుకుపోతున్నా రాష్ట్రంలో ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎమ్మెల్సీలు ఉన్నా కూడా నోరెత్తి మాట్లాడే పరిస్థితి లేదన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రికి, ప్రధాన మంత్రికి మన ముఖ్యమంత్రి దాసోహం చేస్తున్నరన్నారు. ఇదే కొనసాగితే రాబోయే రోజుల్లో రాష్ట్రం ఎడారిగా మారే పరిస్థితి ఉందన్నారు. అత్యధికంగా మన రాష్ట్రంలో ఒక పులివెందుల తాలుకాలోనే ఎక్కువ మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో అనంతపురం నుంచి కడప వరకు నీరు ఇచ్చి రైతులను ఆదుకున్న ఘనత అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికే సాధ్యమైందన్నారు. కేవలం వీరి ప్రచారాల కోసం శిలాఫలకాలను ఆవిష్కరించరడం, ప్రతి పక్షాలను విమర్శించడం, మాట్లాడితే కేసులు పెట్ట డం పనిగా పెట్టుకున్నారని ఇది ఎంతో కాలం జరగదని హెచ్చరించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలులేక ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్లాల్సి వస్తుందన్నారు. రాష్ట్రం అన్ని విధాలుగా బాగుపడాలంటే తిరిగి మనం దరం చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అసవరం ఉందన్నారు. ప్రజలు, రైతులు, రైతు కూలీలు, నిరుద్యోగ యువత ప్రతిఒక్కరు టీడీపీకి మద్దతు పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు నాగేంద్ర, పాల షరీఫ్, మాబాషా, మాబుపీరా, మాజీ సర్పంచ్ నరసింహయ్య, ప్రసాద్‌శెట్టి, సుబ్రహ్మణ్యం, నరసయ్య, రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్ అన్సర్ బాషా, మండల కన్వీనర్ నరసింహారెడ్డి, టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్ వలి, సల్లా నాగరాజు, కొలిమి షరీఫ్, సంజీవరెడ్డి, బాబయ్య, గుడ శేఖర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, గోపాల్, గుత్తి నరసింహులు, బషీర్, భాస్కర్‌రెడ్డి, రియాజ్, అజీమ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమెరికాలో కొలువైన దుర్గామాతకు విజయదశమి శరన్నవరాత్రుల ప్రత్యేక పూజలు



**మిడుతూరు, అక్టోబర్19, ప్రభాతవార్త ;** అమెరికా దేశంలో మిడుతూరుకు చెందిన శ్రీరామ పద్మనాభరావు, శ్రీరామ కామేశ్వరిలు స్థిరపడ్డారు. ప్రతియేడాది విజయదశమి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమెరికాలోని వర్జీనియా, రిచ్‌మండ్ ప్రాంతంలో నివాసముంటున్న ఈ దంపతులు వారి స్వగృహంలో దుర్గామాతను ఏర్పాటు చేశారు. విజయదశమి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ వారు ఏర్పాటు చేసిన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తూ అమ్మవారి ఆశీస్సులు పొందుతున్నారు. దేశంగాని దేశంలో మన తెలుగువారు సాంప్రదాయాలను అనుసరిస్తూ దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేయడం హర్షించదగ్గ విషయం.

# అక్రమ అరెస్టులకు భయపడం..

- చంద్రబాబునాయుడు నిర్దోషిగా బయటకు వస్తారు
- బాబుతో-నేను కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ ఇన్‌చార్జి



ప్రజలతో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి

**కౌతాళంరూరల్, అక్టోబర్19, ప్రభాతవార్త ;** అక్రమ అరెస్టులకు భయపడోమని, టీడీపీ జాతీయ అధ్యక్షులు, మాజీ సీఎం చంద్రబాబునాయుడు నిర్దోషిగా బయటకు వస్తారని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని ఉరుకుంద గ్రామంలో బాబుతో-నేను కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడిపై అధికార పార్టీ వైసీపీ అక్రమ కేసులు బనాయించి హింసకు గురి చేస్తూ పైశాచిక ఆనందం పొందుతోందన్నారు. జగన్‌రెడ్డికి రోజులు దగ్గరపడ్డాయని, ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజల మద్దతు చంద్రబాబునాయుడికే ఉందని, సీఎంగా గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు చెన్నబసప్ప, క్లస్టర్ ఇన్‌చార్జి కొట్రేష్‌గౌడ్, వెంకటపతిరాజు, శివప్పగౌడ్, రాజబాబు, ఉరుకుంద గ్రామ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ



**తుగ్గలి, అక్టోబరు 19, ప్రభాతవార్త**

రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే అది చంద్రబాబుతోనే సాధ్యమని పత్తికొండ టిడిపి ఇంచార్జ కెఈ శ్యాంబాబు అన్నారు. గురువారం మండల పరిధిలోని నల్లగుండ్ల గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ నియోజకవర్గ టిడిపి ఇంచార్జ కెఈ శ్యాంబాబు పాల్గొని వైసిపి పాలనలో ప్రజలకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ ముందుకు కదిలారు. ఈ సందర్భంగా కెఈ శ్యాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యావసర వస్తువుల ధరలు, కరెంటు, బస్సు చార్జీలు విపరీతంగా పెంచి పేద, మధ్య తరగతి ప్రజల బ్రతుకులు భారం చేశారని ధ్వజమెత్తారు. దీంతో రాష్ట్రం బాగుండాలంటే అది చంద్రబాబుతోనే సాధ్యమని ఈ విషయాన్ని ప్రతిఒక్కరు గ్రహించి వచ్చేఎన్నికల్లో తెదేపాకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వినర్ తిరుపాల్ నాయుడు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి, బిసి సెల్ రాష్ట్ర నాయకులు రామనాయుడు, నల్లగొండ రవిచంద్ర, మునేశ్వర్, బొందిమడుగుల ప్రతాప్ యాదవ్, మాజీ ఎంపిటిసి వెంకట్రాముడు, ముక్కెళ్ల రామచంద్ర, మునెప్ప, రాతన మైరాముడు, గిరిగెట్ల సత్యప్రకాష్, మసాల శ్రీను, రామకొండ లాలప్ప, నునసరాల దేవదాస్, రామాంజనేయులు, రాంపల్లి శ్రీనివాసులు, సుభాష్ చంద్రబోస్, పెండేకల్ రామచంద్ర, ఎద్దులదొడ్డి సర్పంచ్ విజయ్, మాజీ సర్పంచ్ వీరేష్‌తో పాటు తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే ప్రాథమిక హక్కు కూడా మాకు లేదా..!

:- టిడిపి మాజీ ఇంచార్జ్ గుడిసె కృష్ణమ్మ



**ఆదోని రూరల్, అక్టోబరు 19, ప్రభాతవార్త**

ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే ప్రాథమిక హక్కు కూడా మాకు లేదా అని టిడిపి మాజీ ఇంచార్జ్ గుడిసె కృష్ణమ్మ అన్నారు. గురువారం మండగిరి పంచాయతీలో గుడిసె కృష్ణమ్మను ఆమె నివాసం నందు ఉదయం 4గంటలకు త్రీటౌన్ సిఐ హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మె మాట్లాడుతూ ఎమ్మిగనూరు బయలుదేరుతున్న విషయం తెలుసుకున్న పోలీసులు తనను ఇంటి నుండి బయటకు రాకుండ హౌస్ అరెస్టు చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం జగన్ ఎమ్మిగనూరు పర్యటన సందర్భంగా టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సభలో నిరసన తెలియజేయడాన్ని అడ్డుకున్న పోలీసులు వైసిపి పార్టీకి వత్తాసులా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్య క్రమంలో టిడిపి రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, రాష్ట్ర నాయీబ్రాహ్మణ సేవా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డేమాన్ గోపాల్, మాజీ ఎంపిపి మురళీ, గిరిధర్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే హౌస్ అరెస్ట్



**ఎమ్మిగనూరు , అక్టోబర్ 19 ప్రభాతవార్త:** ఎమ్మిగనూరు పట్టణంలో సిఎం జగన్ పర్యటన సంధర్బంగా టిడిపి శ్రేణులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేసి స్టేషన్‌కు తరలించారు. మాజీ ఎమ్మెల్యే బివి.జయనాగేశ్వర రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. దీంతో ఆయన పార్టీ కార్యకర్తలతో కలసి ఇంటి ముందు నల్ల జెండాలతో నిరసన తెలిపారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడంలో ప్రభు త్వం పూర్తిగా విఫలమైందని ప్లే కార్డులు ప్రదర్శించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ అక్రమ నిబంధనలు ఆపాలంటూప, టిడిపి హయంలో మంజూరు చేసిన ఆర్‌డిఎస్ ప్రాజెక్టు, టెక్స్‌టైల్స్ పార్కు హమీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు ముందస్తు హౌస్ అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

:- తెర్నేకల్ సర్పంచ్ అరుణ్‌కుమార్

**దేవనకొండ, అక్టోబరు 19, ప్రభాతవార్త :** ఎమ్మిగనూరులో జరిగిన జగనన్న చేదోడు కార్యక్రమంలో ఎమ్మిగనూరు శాసనసభ్యులు ఎర్రకోట చెన్నకేశవరెడ్డి అభ్యర్థన మేరకు ఎమ్మిగనూరు నియోజకవర్గ ప్రజలకు, ఆలూరు నియోజకవర్గ ప్రజలకు రాకపోకలు నిమిత్తం హంద్రీనీవా పైన గాజులదిన్నె ప్రాజెక్టుకు అనుసంధానంగా కావాలని కోరినందుకు మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.47కోట్లతో తెర్నేకల్-గంజళ్ల మధ్యలో హంద్రీనీవాపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మించుటకు నిధులు మంజూరు చేస్తానని మాటిచ్చినందుకు తెర్నేకల్ సర్పంచ్ మొగతాల్ అరుణ్‌కుమార్ మరియు ప్రజలు ముఖ్యమంత్రి, మంత్రి గుమ్మనూరు జయరాం, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం





**దేవనకొండ, అక్టోబరు 19, ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఈదుల దేవరబండ-మాచాపురం గ్రామ రహదారి మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఇలా వున్నాయి. గోనెగండ్ల మండలం వేముగోడు గ్రామానికి చెందిన మాబుసాబ్ అలియాస్ దుబ్బ మాబు(64), ఇబ్రహీం(50)అనే వ్యక్తులు పత్తికొండకు వెళ్లి వ్యక్తిగత పనులు ముగించుకుని స్వగ్రామానికి మోటార్ సైకిల్‌పై వెళుతుండగా కర్నూలు నుండి బళ్లారి వైపు ఎదురుగా వస్తున్న బొలోరో జీపు మోటార్ బైక్‌ను ఢీకొనడంతో బైక్‌పై వెళుతున్న ఆ ఇద్దరు వ్యక్తులు తీవ్రగాయాలకు గురై అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు రోడ్డు ప్రమాదం సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అయితే మృతులలో దుబ్బ మాబు అనే వ్యక్తి శుభ, అశుభ కార్యక్రమాలలో డోలు వాయిస్తూ కావాలి పాటలు పాడడం, హాస్యాస్పదం చేయడంలో మంచి పేరు కలిగిన వ్యక్తి ఆయన మృతితో కుటుంబ సభ్యులు, మిత్రులలో విషాదచాయలు అలముకున్నాయి.

## విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

**బేతంచెర్ల, అక్టోబర్19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని బేతంచెర్ల సబ్‌డివిజన్ విద్యుత్ ఉద్యోగులు స్థానిక సబ్‌స్టేషన్ నందు నల్లబ్యాడ్జీలతో గురువారం నిరసన తెలియజేశారు. జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న పర్మినెంట్, కాంట్రాక్ట్ ఉద్యోగులు సమస్యలను ఎదుర్కొంటున్నారని న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పర్మినెంట్ ఉద్యోగులు సురేష్‌బాబు, నిరంజన్ బాబు, కాంట్రాక్ట్ కార్మికులు సుబ్బయ్య, గిరి కుమార్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

## ఘాటెక్కిన ఎండుమిర్చి ధరలు

**కర్నూలు అర్బన్, అక్టోబరు 19, ప్రభాతవార్త:** కర్నూలు వ్యవసాయ మార్కెట్‌యార్డులో నెలరోజుల నుండి ఎండుమిర్చి రోజు రోజుకు ఎగబాకుతూ ఊహించనంత ధర రూ.21 వేలు పలకడం ఆశ్చర్యానికి గురిచేసింది. ఆముదాలు, వాము, వేరుశనగ మొదలైనటువంటి సరుకులు అన్నికూడ నిలకడగా ఉన్నప్పటికి ఎండుమిర్చిమాత్రం గత నెల రోజుల పైపైకి ఎగబాకుతూ ఊహించనంత గరిష్ట ధర రూ.21 వేలు పలకడంతో రైతు సోదరులు, మార్కెట్ అధికారులు ఆనందం వ్యక్తం చేశారు. సకాలంలో వర్షాలు పడనందుకు పంటదిగుబడి సరిగా లేనందుకు మార్కెట్‌కు సరుకు తక్కువగా రావడం తోటి ఎండుమిర్చికి మంచిధర పలికిందని ప్రజలు, రైతులు తెలిపారు.

## శ్రీధనలక్ష్మిదేవి అలంకారంలో శ్రీవాసవికన్యకాపరమేశ్వరిదేవి

**నందికొట్కూరు, అక్టోబర్ 19, ప్రభాతవార్త:** దేవి శరన్నవరాత్రుల మహోత్సవాలలో భాగంగా శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి అత్యంత వైభవ అలంకారంలో శ్రీధనలక్ష్మిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం నృత్య ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు అమ్మవారికి మహా హారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.